

రామప్పలో మాట్లాడుతున్న కాకతీయ హెరిటేజ్ సభ్యులు

## రామప్పలో ప్రపంచ వారసత్వ దినోత్సవం

ములుగురూరల్, ఏప్రిల్ 18 : ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంలో వేడుకలు నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ పాండు రంగారావు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే రామప్ప దేవాలయానికి నష్టం జరగనున్నదని అన్నారు. రామప్ప దేవాలయ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. 800యేళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్పదేవాలయం ములుగు ప్రాంతంలో ఉండటం ఈ ప్రాంత వాసులకు ఎంతో గర్వకారణమని అన్నారు. సింగరేణి సంస్థ తవ్వకాలు చేపడితే రామప్ప సరస్సులో బుంగలు ఏర్పడి కట్ట తెగే ప్రమాదం ఉందని అన్నారు. సింగరేణి సంస్థలకు రామప్ప పరిసరాల్లో తవ్వకాలకు అనుమతులను ఆపి దేవాలయాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్‌రావు, ప్రొఫెసర్ దేవప్రతాప్, ప్రొఫెసర్ సాంబయ్య, ప్రొఫెసర్ గణపతి, జీఆర్‌సీ రెడ్డి, శ్రీనివాస్, రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

## మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



మట్టి టిప్పర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కాటారం, ఏప్రిల్ 18 : శంకరాంపల్లి సమీపంలోని భూముల నుంచి పరిమితికి మించి అక్రమంగా మట్టిని టిప్పర్లలో తరలిస్తుండగా గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. దీంతో సమీపంలోని పొలాలకు నీళ్లందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి విస్తరణ పనుల కోసం కాంట్రాక్టర్లు అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలతో వానాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గ్రామంలో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్నారు. అధికారులు మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులు మహేశ్, శ్రీకాంత్, చంద్రయ్య, రాజబాపు, సంతోష్, వెంకటస్వామి, సమ్మయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.





డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న ఐటీ మాస్టర్ శంకర్, అవార్డుతో మురహరి మధుసూదన్

## ఇద్దరికి డాక్టరేట్ ప్రదానం

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) /కృష్ణకాలనీ : సామాజిక సేవలో మురహరి మధుసూదన్‌కు, ఐటీ మాస్టర్ స్కిల్ హబ్ డైరెక్టర్, మిరాకిల్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు వేముల శంకర్ పనితీరును గుర్తించిన ఏసియా వేదిక్ ఇంటర్‌నేషనల్ కల్చర్ అండ్ రీసర్చ్ స్ఫూర్తి అకాడమీ (న్యూఢిల్లీ) సంస్థ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వారికి అవార్డు ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలోని జంగేడుకు చెందిన మధుసూదన్ పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఒక వైపు ఉద్యోగం చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. కరాటే, కుంగ్‌ఫూలో ఎంతో మంది పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. ఈ క్రమంలో 2023లో జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం మురహరి సేవా ట్రస్టును కొనసాగిస్తూ ఆచార్య జయశంకర్ సేవా సమితి (అక్కన్నపేట) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. చిన్న తనం నుంచే మధుసూదన్ సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అలాగే ఐటీ మాస్టర్ శంకర్ సామాజిక సేవ చేసేందుకు 14ఏళ్ల క్రితం మిరాకిల్ వలంటరీ ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. రక్తదాన శిబిరాలు పెట్టి సుమారు 5వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందజేశారు. జిల్లాలో రోడ్లపై తిరగుతున్న మానసిక రోగులకు పునరావసం కల్పించడం, పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, యువతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి మార్గాలు చూపించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసేవారు. వీరి సేవలను గుర్తించిన ఏసియా వేదిక్ ఇంటర్‌నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ అవార్డులను అందజేసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.

NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# మంత్రులు ఆరోపణలు నిరూపించాలి

- భూ భారతితో రైతులకు ఒరిగేది ఏమీలేదు
- బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి



మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

ములుగు, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : భూ భారతి సదస్సులో భాగంగా వెంకటాపూర్ మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడి, సీతక్క చేసిన ఆరోపణలను నిరూపించాలని బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ధరణి పేరుతో ములుగు నియోజకవర్గంలో అవకతవకలు జరిగాయని మంత్రి సీతక్క అవాకులు చవాకులు మాట్లాడారని, వాటిని బహిరంగంగా నిరూపించాలని నాగజ్యోతి డిమాండ్ చేశారు. భూ భారతి చట్టంతో రైతులకు ఒరగబెట్టేది ఏమీ లేదన్నారు. ఆర్భాటాల నడుమ చేపట్టిన రెవెన్యూ సదస్సులతో రైతులను గందరగోళానికి గురి చేయడంతో పాటు ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయని ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ములుగు ప్రభుత్వ దవాఖానలో బిడ్డను కోల్పోయి బాధపడుతున్న బాలింత తల్లి రవళితో పాటు ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చలేని పరిస్థితుల్లో మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారని మండిపడ్డారు. కడుపు కోత కంటే సమావేశం ఎక్కువైందని విమర్శించారు. జిల్లా ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారిందని, ములుగు ప్రభుత్వ దవాఖానలో రోగులకు ఉచిత వైద్యం సరిగా అందడం లేదని తెలిపారు. జిల్లాలో వడగండ్ల వానకు నష్టపోయిన రైతులను పరామర్శించడం మంత్రులకు గుర్తు రాలేదా అని విమర్శించారు. నియోజకవర్గ మంత్రిగా ఉన్న సీతక్క రైతు ఆత్మహత్య చేసుకున్న సమయంలో, వానలకు పంటలు కోల్పోయిన రైతులను కూడా పరామర్శించలేని పరిస్థితుల్లో ఉందని తెలిపారు. ఇండ్లు కోల్పోయిన ప్రజలకు తక్షణ సాయంగా రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, నాయకులు గండి కుమార్, ఆకుతోట చంద్రమౌళి, రాందాస్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో శ్రీహర్షిణి దంపతులు

## కేసీఆర్‌ను కలిసిన శ్రీహర్షిణి

కాటారం, ఏప్రిల్ 18 : తన పుట్టినరోజు సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి భర్త రాకేశ్‌తో కలిసి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీహర్షిణి రాకేశ్ దంపతులు ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

## అడవిలో సిగరెటు తాగిన వ్యక్తిపై కేసు

**రూ. 5వేలు జరిమాన**

ఏటూరునాగారం, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని అభయారణ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి సిగరెటుతాగుతుండగా అటవీశాఖ అధికారులు గుర్తించి జరిమానా విధించారు. శుక్రవారం సాయంత్రం వెంకటాపురం మండలానికి చెందిన జాడి సాయినాథ్ మండల కేంద్రంలోని దక్షిణ రేంజ్ కార్యాలయం ఎదురుగా ఉన్న మీటింగ్ హాల్ వెనుకవైపు అడవిలో సిగరెటుతాగుతుండగా అతన్ని అదుపులోకి తీసుకుని రూ.5వేల జరిమానా విధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వేసవిలో అడవులకు నిప్పంటుకునే అవకాశముందని, వాహనదారులు సిగరెట్లు తాగి పడేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిబంధనలను పాటించాలని ఆయన తెలిపారు.

## ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వినతి

ములుగురూరల్, ఏప్రిల్ 18 : వెంకటాపూర్ పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ములుగు జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఐజేయూ జిల్లా అధ్యక్షుడు షఫీఅహ్మద్ మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జర్నలిస్టులు బేతి సతీశ్, గంపల శివకుమార్, మాధూరి సురేశ్, పిట్టల మధుసూదన్, సృజన్, అబ్జల్‌పాషా ఉన్నారు.

## మే 5న ములుగు కలెక్టరేట్ ముట్టడి

వాజేడు, ఏప్రిల్ 18 : ఆదివాసీ చట్టాలు, సమస్యల పరిష్కారానికి మే 5తేదీన తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య కోరారు. మండలంలోని పేరూరు గ్రామంలో శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ముట్టడికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్, నాయకులు లొడిగ నర్సింహరావు, కుర్సం సుధాకర్, మనోజ్, అర్జున్, గోపి, వెంకటేశ్, తేజ, శంకర్, నాగరాజు, ప్రశాంత్, రాంబాబు పాల్గొన్నారు.

## పుష్కరాల పనుల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

మహదేవపూర్ (కాళేశ్వరం), ఏప్రిల్ 18 : కాళేశ్వరంలో రూ.25 కోట్ల నిధులతో చేపడుతున్న సరస్వతీ పుష్కరాల పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేశ్ ఆరోపించారు. నిబంధనల ప్రకారం పనులు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనులు పూర్తి చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొందరు నాన్ లోకల్ వ్యక్తులు ఎండోమెంట్ అభివృద్ధి పనులు తాము చేసిందే సబబు అన్నట్లు చేపడుతున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి నిబంధనలను పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ల అప్పగింత

చిట్యాల/ మొగుళ్లపల్లి, ఏప్రిల్ 18 : సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం ఎస్సై శ్రావణ్‌కుమార్‌తో కలిసి సీఐ మల్లేశ్‌యాదవ్ అందజేశారు. జూకల్ గ్రామానికి చెందిన సిరిగిరి రవీందర్, వెంకట్రావుపల్లి(సి) చెందిన ఉప్పుల రవీందర్ రెండు నెలల క్రితం పోలీస్‌స్టేషన్లో సెల్‌ఫోన్లు పోయాయని వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని రికవరీ చేసి బాధితులను పిలిచి అప్పగించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా సైబర్ క్రైమ్‌కు గురయితే 1930 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కానిస్టేబుల్ లాల్ సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన గైకాడి నరేశ్ ఫోన్ పోగొట్టుకోగా కొన్ని గంటల్లోనే కనుగొని బాధితుడికి ఎస్సై అశోక్ అందజేశారు. బాధితుడికి గంటల వ్యవధిలో ఫోన్ అందజేయడంలో కృషి చేసిన పోర్టల్ ఆపరేటర్ జ్యోతిని ఎస్సై అభినందిచారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

గోవిందరావుపేట, ఏప్రిల్18 : గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎస్సై అచ్చ కమలాకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలోని రానంగర్, మాన్య తండా, పాపయ్యపల్లి గ్రామాల్లో దాడులు చేసి 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 25లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వాజేడు, ఏప్రిల్ 18 : కన్నాయిగూడెం మండలం దేవాదుల గ్రామానికి చెందిన భాస్కర్ వాజేడు మండలంలోని పేరూరు గ్రామం నుంచి బైక్‌పై జగన్నాథపురం వైపు వస్తున్నాడు. వెంకటాపురం మండలం ఎస్సీ మర్రిగూడెంకు చెందిన కొగిల అశ్విని లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కింది. ఇద్దరు గుమ్మడిదొడ్డి గ్రామంలోకి రాగానే వెంకటాపురం వైపు నుంచి ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. అశ్విని, భాస్కర్‌లకు గాయాలు కావడంతో 108లో చికిత్స నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు.

**రేగొండ మండల కేంద్రంలో మరొకరికి..**

రేగొండ, ఏప్రిల్ 18 : రోడ్డు ప్రమాదంలో గోరికొత్తపల్లి మండలం దామరంచపల్లెకు చెందిన బండి కుమారస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుమారస్వామి అవసర నిమిత్తం రేగొండ మండల కేంద్రంలోని రావులపల్లెలోని అత్తగారింటికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రేగొండ మండలకేంద్రంలోని పెద్ద బస్టాండ్ సమీపంలో హనుమకొండ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కుమారస్వామికి తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

## బొమ్మాపూర్ క్రాస్‌లో వాహనాల తనిఖీలు

మహదేవపూర్, ఏప్రిల్ 18 : మండలకేంద్రంలోని బొమ్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం పోలిసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిపై వచ్చిపోయే వాహనదారుల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్‌లను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. ఎస్సై 2 రాందేవ్, పోలిసులు చద్రమోహన్, కిషన్ ఉన్నారు.

## ఆదివాసీ సంఘ ఆవిర్భావ దినోత్సవం

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 18 : తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకను శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, మునేశ్వర్‌రావు, లక్ష్మణ్, రాకేశ్, లక్ష్మి, స్వరూప, ఉషారాణి, సుశీల, నాగరాజు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగజ్యోతి

## బీఆర్‌ఎస్ సభకు తరలిరావాలి

ములుగురూరల్, ఏప్రిల్ 18 : బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించే సభ సందర్భంగా రూపొందించిన వాల్ పోస్టర్లను శుక్రవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఏర్పడి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే సభకు ములుగు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన గ్రామ కమిటీ నాయకులు

## కొత్తూరు బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

ములుగురూరల్, ఏప్రిల్ 18 : ములుగు మండలంలోని కొత్తూరు గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడ్డూరి రాజు, ఉపాధ్యక్షుడిగా అక్కల పోశాలు, ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల అశోక్, కార్యదర్శిగా అక్కల మాధవులు, కోశాధికారి కంచ కృష్ణ, ప్రచార కార్యదర్శిగా కస్తూరి సురేశ్, ముఖ్యకార్యవర్గ సభ్యులుగా బండి రమేశ్, కోరె రాజు, దొమ్మటి మల్లయ్య, తక్కళ్లపల్లి కిషన్‌రావు, అమ్మ కుమార్, మండల నరేందర్, గౌరవ అధ్యక్షులుగా తక్కళ్ళపెల్లి దేవేందర్‌రావు, సామ కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు.

## మల్లూరు ఆలయంలో ఉగాది డైరీ ఆవిష్కరణ



ఉగాది డైరీని ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ

మంగపేట, ఏప్రిల్ 18 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా అర్చక, ఉద్యోగ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మక్కామల రాజశేఖర్‌శర్మ, ఆలయ అర్చకులు ఈశ్వర్‌చందుశర్మ, కారంపొడి పవన్ కుమార్ ఆచార్యులు, సిబ్బంది అజయ్, సుధీర్‌తో కలిసి ఆయన ఉగాది డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు త్వరలోనే సీఎం ఓ సమావేశం ఏర్పాటు చేయడానికి అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు.

## వీడిన వృద్ధురాలి హత్య మిస్టరీ

- కోడలిని ఇరికించేందుకు ఘాతుకం
- నిందితుడు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాసి
- అరెస్టు చేసిన కాటారం పోలీసులు

కాటారం, ఏప్రిల్ 18 : మండలంలోని ఆదివారంపేటలో జరిగిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. గుర్తు తెలియని దుండగుడు హత్య చేసినట్లు కేసు నమోదు చేసిన కాటారం పోలీసులకు విచారణలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. మృతురాలి కోడలితో వివాహేతర సంబంధం నెరపిన వ్యక్తి ఆమెను హత్య కేసులో ఇరికించాలని పథకం ప్రకారం వృద్ధురాలిని దారుణంగా చంపి కటకటాల పాలయ్యాడు. ఈ మేరకు కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, శ్రీనివాస్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈనెల 12న ఆదివారంపేట గ్రామంలో ఓడేటి మల్లక్క (67) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రాత్రి దారుణ హత్యకు గురైన సంఘటన విధితమే. ఆమె కూతురు ముల్కల శ్రీదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్పీ కిరణ ఖరే ఆదేశాలతో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు, కాటారం సీఐ నాగార్జునరావుతో పాటు ఎస్సైలు హత్య జరిగిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం సాయంతో నేర పరిశోధన చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతురాలి కోడలు శ్రీలతతో కొమురంభీం అసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బారెగూడ గ్రామానికి మోరలే శివ అలియాస్ శివాజీతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త సహజీవనానికి దారితీసింది. కొద్ది రోజులు అతడితో సహజీవనం చేసి అతడి వేధింపులు తాళలేక అతని నుంచి విడిపోయి మళ్లీ ఆదివారంపేటకు వచ్చింది. ఈ నేపథ్యంలో శివ మళ్లీ శ్రీలతను కలిసేందుకు పలు మార్లు ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న శివ ఆమెను హత్య కేసులో ఇరికించి జైలుకు పంపించాలని పన్నాగం పన్నాడు. అదే గ్రామంలోని శ్రీలత అత్త మల్లక్కను చంపితే ఆ కేసు ఆమెపైకి వెళ్తుందని గ్రహించి 12వ తేదీన రాత్రి నిందితుడు శివ పథకం ప్రకారం మల్లక్క ఇంటికి వెళ్లి నిద్రలో ఉన్న ఆమెను అక్కడే ఉన్న గొడ్డలితో బాది హత్య చేసి పారిపోయాడు. ఐతే ఘటనా స్థలంలో లభించిన గొడ్డలి ఆధారంగా పోలీసులు విచారణ చేపడుతున్న క్రమంలో శుక్రవారం కాటారంలోని పత్తి మిల్లు వద్ద అనుమానాస్పదంగా ఉన్న శివను అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. కాగా, మిస్టరీని ఛేదించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐలు నాగార్జునరావు, రాంచందర్‌రావు, ఎస్సైలు అభినవ్, శ్రీనివాస్, సిబ్బందిని ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

## ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 18 : సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు, అధికారులు రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థ ఇచ్చిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వీ సూర్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన భూపాలపల్లి ఏరియాను సందర్శించారు. అనంతరం జీఎం కార్యాలయంలో భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనుల ఉత్పత్తి ఉత్పాదకతల రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ రవాణాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించిబొగ్గు రవాణా లక్ష్యం కూడా సాధించాలన్నారు. ఓపెన్ కాస్టు గనులకు సంబంధించిన భూ సేకరణ రిమూవల్‌లో ఎదురయ్యే ఇబ్బందులను తక్షణమే పరిష్కరించుకొని ఉత్పత్తి సాధించాలన్నారు. కార్మికులకు వైద్య సదుపాయం, సంక్షేమ పథకాలు సరిగ్గా అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, కేటీకే ఓసీ-2 పీవో వెంకటరామరెడ్డి, ఎస్‌వోటూ జీ ఎం కవీంద్ర, కేటీకే ఓసీ-3 పీవో భిక్షమయ్య, ఏరియా అధికార ప్రతినిధి మారుతి పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

మహదేవపూర్(కాళేశ్వరం)/ మంగపేట, ఏప్రిల్ 18 : మహదేవపూర్, మంగపేట మండలాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్‌లు, క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం యేసు సందేశాన్ని వివరించారు. యేసుక్రీస్తు తనను హింసించిన వారిని సైతం క్షమించాడని, ఆయన బోధనల ప్రకారం ఇతరులకు క్షమాగుణంతోపాటు, సేవాభావం కలిగి ఉండాలన్నారు. కమలాపురం రోమన్ కేథలిక్ చర్చి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సిలువ యాత్ర ఆకట్టుకున్నది. ప్రార్థనల్లో ఫాదర్ సునీల్, పాస్టర్‌లు జోషఫ్, ప్రకాశ్, సురేశ్, ఆదాం, విజయరాజు, దేవరాజు, కృపానిధి, జానేశ్, సత్తిబాబు, సంఘ పెద్దలు, విశ్వాసులు, గ్రామస్తులు ,క్రిస్టియన్‌లు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

మంగపేట, ఏప్రిల్ 18 : నిజామాబాద్ జిల్లా, తాళ్ల రాంపూర్ గ్రామంలో తాటి చెట్లు ఎక్కి బతుకుతున్న గీత కార్మికులు గ్రామాభివృద్ధి కమిటీకి డబ్బులు ఇవ్వలేదన్న కక్షతో గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసిన వీడీసీ పెద్దలను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు లోడె శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం మాట్లాడారు. కేవలం వీడీసీకి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కొద్దని, ఎవ రూ కల్లు తాగొద్దని గ్రామంలో దండోరా వేయించడం, ఈత చెట్లను దహనం చేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల శ్రీరామ నవమి రోజున గుడికి వెళ్లిన గౌడ కుల మహిళలను కూడా పూజల్లో పాల్గొనవద్దని అవమానపరిచి బయటకు పంపడం రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని ఆరోపించారు. ఇలా చేతి వృత్తిదారులపై వీడీసీ పేరుతో నియంతృత్వ పెత్తనం చేస్తు న్న వీడీసీ బృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీడీసీ పేరుతో చేస్తున్న అరాచకాన్ని నిరసిస్తూ పలువురు గీత కార్మికులు తాటి చెట్టుపైకెక్కి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గాజుల ఈశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, బూర శ్రీనివాస్, పానుగంటి వెంకటేశ్వర్లు, యాదగిరి, జాడి శేఖర్, సాంబయ్య, పంజాల సత్యం పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన



పెట్రోల్ బంక్ వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం, ఏప్రిల్ 18 : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు తమకు సమాచారం అందజేయాలని స్థానిక ఫైర్ స్టేషన్ అధికారులు కోరారు. మండలంలోని చిన్నబోయినపల్లి పెట్రోల్ బంక్‌లో అగ్నిమాపక వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదం సంభవించినప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 101, అగ్నిమాపక కేంద్రంలోని 8712685772ను కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రవికుమార్, భార్గవ్, శ్రీకాంత్, అనీల్, రాజు పాల్గొన్నారు.

## ఎర్ర చందనం పంట దగ్ధం

**సుమారు రూ.15 లక్షల వరకు నష్టం**

చిట్యాల, ఏప్రిల్ 18 : మండలంలోని ముచినిపర్తి రెవెన్యూ శివారులోని గుంటూరుపల్లికి చెందిన పాలెపు మాధవికి చెందిన ఎర్ర చందనం, శ్రీగంధం, జామ తోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటున్నామని, మూడు రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి తోటలో ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయన్నారు. దీంతో మంటలు చెలరేగి తోట అంతా కాలిపోయిందని తెలిపారు. గురువారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో అక్కడికి చేరుకొని పరిశీలించగా ఎకరంన్నరలో మొక్కలన్నీ దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేండ్ల పంట, డ్రిప్ పైపులతో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు. అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## ములుగు సీఐగా దారం సురేశ్

ములుగురూరల్, ఏప్రిల్ 18 : ములుగు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దారం సురేశ్‌ను నియమిస్తూ 1వ మల్టీ జోన్ ఐజీ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు సీఐగా పనిచేస్తున్న వీ శంకర్‌ను ములుగు డీఎస్‌బీ విభాగంలో సీఐగా నియమించారు. ఆయన స్థానంలో హైదరాబాద్ మల్టీ జోన్ ఐజీపీ కార్యాలయంలో సీఐగా పనిచేస్తున్న దారం సురేశ్‌ను నియమించారు. సీఐగా సురేశ్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 18 : ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూనియన్ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఆర్థిక నష్టం లేనటువంటి 317 జీవో బాధితులను సొంత జిల్లాలకు బదిలీలు చేసి న్యాయం చేయాలన్నారు. లేకపోతే వేసవి సెలవుల్లో పీఆర్టీయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, అబ్దుల్లా నేతృత్వంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావులకార్ వెంకటేశ్, దావు రమేశ్, పున్నం చందర్, సాగర్, తాడిచర్ల రవి పాల్గొన్నారు.

# రేషన్ కోసం ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే..

**వ్యయ ప్రయాసలతో వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులు**



రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న రెడ్డిపల్లి గిరిజన మహిళలు (ఫైల్)

మహాముత్తారం, ఏప్రిల్ 18 : స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా కొన్ని పల్లెలు మాత్రం ఇంకా అభివృద్ధి చెందలేదనడానికి రెడ్డిపల్లి గ్రామమే నిదర్శనం. ఇప్పటికీ ఈ గ్రామంలో రేషన్ షాపు లేదు. సుమారు ఆరు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి ఉమ్మడి గ్రామ పంచాయతీ అయిన కనుకునూర్‌లో రేషన్ తీసుకొని తిరిగి ఆరు కిలోమీటర్ల నడిచి ఇంటికి చేరుకోవాలి. మహాముత్తారం మండలంలో విసిరేసినట్లు, దట్టమైన అడవి ప్రాంతంలో ఈ రెడ్డిపల్లి గ్రామం ఉన్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ఇక్కడి గిరిజనుల కష్టాలు చూసి నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేశారు. ఇక్కడ గ్రామ జనాభా 650 కాగా, ఓటరు లిస్టులో మాత్రం 400 మంది ఉన్నారు. రెడ్డిపల్లి గ్రామానికి 120పైగా తెల్లరేషన్ కార్డులుండగా 35 క్వింటాళ్ల బియ్యం ప్రతి నెలా రేషన్ షాపుల ద్వారా తీసుకుంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అంధులు రేషన్ షాప్ దూరం కావడంతో నెలనెలా రేషన్‌షాపునకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం సన్న బియ్యం ఇస్తుండడంతో తెచ్చుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. కానీ, ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపునకు వెళ్లాలంటే మాత్రం ఇబ్బందిపడుతున్నారు.